సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 18 । మే । 2024



చీనీ టన్ను రూ.36,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36,500 పలికాయి. మార్కెట్‌కు 1,074 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ఎండిన వక్క రైతుల ఆశలు

వక్క రైతుల ఆశలపై భానుడు నిప్పులు పోశాడు. ఎండ వేడికి కంకులు చెట్లపైనే ఎండిపోయాయి. దీంతో పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేదు.

10లో

గరిష్టం/కనిష్టం
36.9°/22.1°

జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ.వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా ఎండుమిర్చి రూ.12 వేలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం క్వింటా ఎండుమిర్చి రూ.12 వేలు పలికాయి. మార్కెట్‌కు 52 క్వింటాళ్ల సరుకు రాగా, అధికారులు ఈ- నామ్ పద్ధతిలో వేలం వేశారు. ఇందులో క్వింటా గరిష్టంగా రూ.12 వేలు, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

అక్కడక్కడా వర్షం



వర్షానికి మడకశిరలో జలమయమైన ప్రధాన రహదారి

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో అక్కడక్కడా వర్షాలు పడుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. శ్రీ సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, మడకశిర, తనకల్లు, అనంతపురం జిల్లాలోని బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, విడపనకల్లు మండలాల్లో పదును వర్షం కురిసింది. కదిరి, అమడగూరు, నల్లచెరువు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఆత్మకూరు, కంబదూరు, బెళుగుప్ప, గార్లదిన్నె, ఉరవకొండ, కూడేరు, గుంతకల్లు, పామిడి తదితర మండలాల్లో తేలికపాటి నుంచి తుంపర్ల వర్షం పడింది.

22 వరకు వర్షాలు..

22వ తేదీ వరకూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు తెలిపారు.

- పుట్టపర్తికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సోమవారం ఉదయం బెంగళూరు వెళ్లాలనుకున్నాడు. వేసవి సీజన్ కావడంతో పర్యాటకుల తాకిడితో రైలులో బెర్తు దొరకలేదు. బస్సుల్లో సీట్లన్నీ ఫుల్ చూపించాయి. వెంటనే యాప్ ద్వారా 'కార్ పూలింగ్' చెక్ చేసుకున్నాడు. సీటు అందుబాటులో ఉండటంతో బుక్ చేశాడు. బస్సు చార్జీకే బెంగళూరుకు చేరుకున్నాడు. మధ్యలో గోరంట్లలో మరో ప్రయాణికుడూ అదే కారును ఆశ్రయించాడు.
- బెంగళూరులో ఉద్యోగం చేస్తోన్న ఓ వ్యక్తి శనివారం సాయంత్రం కదిరి వెళ్లాలని ప్రయత్నించగా.. బస్సుల్లో సీట్లు దొరకలేదు. వెంటనే 'కార్ పూలింగ్' యాప్‌ను సంప్రదించి సీటు పొందాడు. అనుకున్న సమయానికి ముందే ఇంటికి చేరుకున్నాడు. అక్కడి నుంచి పుట్టపర్తికి వెళ్లాలని మరో ప్రయాణికుడు చిక్కబళ్లాపురం వద్ద అదే కారును ఆశ్రయించాడు. టోల్‌చార్జీలు పోగా.. తనకు గిట్టుబాటు అయ్యిందని డ్రైవర్ తెలిపాడు.



'కారు'చౌక ప్రయాణం

జిల్లాలో పెరుగుతున్న 'కార్ పూలింగ్' కల్చర్

- బస్సు చార్జీకే కారులో బెంగళూరుకు ప్రయాణం
- నచ్చిన చోట పికప్, డ్రాప్ సదుపాయం
- సమయంతో పాటు డబ్బు, ఇంధనం ఆదా
- పెరిగిన టెక్నాలజీతో ఎందరికో ఉపయోగం

సాక్షి, పుట్టపర్తి

అద్దె కారు ప్రయాణం ఖరీదైంది. ఇద్దరు.. నలుగురు కలిసి హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నుంచి పొరుగు రాష్ట్రం కర్ణాటక రాజధాని బెంగళూరు వెళ్లాలంటే రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు అవుతోంది. పెరిగిన ఇంధన ధరలు, ఖర్చుల నేపథ్యంలో అంతకన్నా తక్కువ తీసుకుంటే తమకు గిట్టుబాటు కాదని ట్రావెల్స్ నిర్వాహకులు చెబుతున్నారు. బస్సుల్లో రద్దీ, సమయం వృథా, సిటీలో ట్రాఫిక్ జామ్ సమస్య. దీంతో చాలామంది కారులో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీ.. కారు ప్రయాణాన్ని చౌక ధరలకే అందిస్తోంది. 'కార్ పూలింగ్'కు కొన్ని మొబైల్ యాప్‌లు అందుబాటులోకి రావడంతో జిల్లాలోని చాలామంది సద్వినియోగం చేసుకుంటున్నారు. ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ, గోరంట్ల, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు వెళ్లేవారు అక్కడి నుంచి తిరుగు పయనం అయ్యేవారు యాప్ ద్వారా కార్ పూలింగ్ ద్వారా ప్రయాణం చేస్తున్నారు. తక్కువ ధరకే షేరింగ్ జర్నీ చేస్తూ సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు.

పెరిగిన 'కార్ పూలింగ్' కల్చర్

జిల్లాలో కార్ పూలింగ్ కల్చర్ ఇటీవల బాగా పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య కూడా పెరిగింది. ఫలితంగా విద్యార్థులు, ఉద్యోగులు కార్ పూలింగ్ ద్వారా బెంగళూరుకు వెళ్లి వస్తున్నారు. ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ, గోరంట్ల, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాలకు చెందిన చాలామంది ఉద్యోగులు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. వారాంతపు సెలవుల్లో ప్రయాణాలు, మూడు రోజులకోసారి కంపెనీకి వెళ్లి వచ్చే వారి సంఖ్య పెరిగింది. తక్కువ ధరకే కారు ప్రయాణం అందుబాటులోకి రావడంతో నిత్యం రాకపోకలు సాగించే వారి సంఖ్య రెట్టింపయ్యింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం, కోర్టుల్లో కేసులు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు.. తదితర అవసరాల రీత్యా బెంగళూరుకు ప్రయాణిస్తున్న వారి సంఖ్య చాలానే ఉంది.

ఓనర్‌కు.. రైడర్లకూ ఉపయోగమే

యాప్‌లు కార్లు లేని వారికే కాదు.. సొంత వాహనాలున్న వారికీ ఉపయోగపడుతున్నాయి. వారాంతపు సెలవులు, పండుగల సమయాల్లో సొంతూళ్లకు వస్తున్న వారు.. యాప్ ద్వారా ఇతరులను వాహనాల్లో తీసుకొచ్చి.. లాభాలు పొందే అవకాశం ఉంది. కుటుంబ సభ్యులను ఊర్లో దింపి.. తిరుగు పయనంలో ఒంటరిగా వెళ్తున్న సమయంలో చాలామంది యజమానులు కూడా ఈ యాప్‌ల ద్వారా ప్రయాణికులను తీసుకెళ్తుంటారు. బ్లాబ్లా, క్విక్ రైడ్ తదితర యాప్‌లపై చాలామందికి అవగాహన ఉంది. బస్సు చార్జీతో కారు ప్రయాణం అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో చాలామంది కార్ల వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో యాప్ ద్వారా నిమిషాల్లో సీట్లు ఫుల్ అవుతున్నట్లు తెలుస్తోంది.

నచ్చిన చోట పికప్, డ్రాప్

బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో దిగి.. అక్కడి నుంచి ఇంటికెళ్లాలంటే క్యాబ్‌కు రూ.200, రూ.300 చెల్లించాల్సిన పరిస్థితి. అదే యాప్ ద్వారా కార్లలో వెళ్తే నచ్చిన చోట పికప్, డ్రాప్ సదుపాయం ఉంటుందని చాలామంది ఆసక్తి చూపుతున్నారు. పుట్టపర్తి, గోరంట్ల, పెనుకొండ నుంచి బెంగళూరు వెళ్లేవారు చాలామంది 'కార్ పూలింగ్'నే అనుసరిస్తున్నారు. నచ్చిన చోటకు వాహనం వస్తుండటతో ఆటోలు, క్యాబ్‌లను సంప్రదించే పని లేకుండా ఉందని చెబుతున్నారు.

పండుగ సమయాల్లో రద్దీ

పండుగల సమయంలో రైళ్లలో సీట్లు దొరకవు. బస్సుల్లో సీట్లు ఫుల్ అవుతాయి. ఉన్నఫలంగా ఊరెళ్లాలనుకునే వారికి ఈ యాప్‌లు బాగా ఉపయోగపడుతున్నాయి. నిమిషాల్లో సీటు దొరకడం.. వెంటనే కారు రావడం.. గంటల వ్యవధిలో గమ్యస్థానానికి చేరుకోవడం.. ఇలా చకచకా జరిగిపోతున్నాయి. ఫలితంగా పండుగల సమయంలో టోల్ గేట్ల వద్ద కార్ల తాకిడి విపరీతంగా ఉంటోంది.



సమయం, ఇంధనం ఆదా

కార్ పూలింగ్‌తో సమయంతో పాటు ఇంధనం కూడా ఆదా అవుతోంది. ఒకే కారులో నలుగురు ప్రయాణిస్తున్న కారణంగా డబ్బు షేరింగ్ చేసుకుంటారు. ఒకసారి ఇంధనం కొట్టించి.. అందరూ ఒకేసారి ప్రయాణిస్తారు. ఎవరికి వారుగా ఒక్కొక్కరు ఒక్కో వాహనంలో వెళ్తే డబ్బు ఖర్చు కావడంతో పాటు ఇంధనం వృథా అవుతుంది. అంతేకాకుండా ట్రాఫిక్‌జామ్ అవుతుంది. పర్యావరణం కలుషితం అవుతుంది. కార్ పూలింగ్‌తో చాలా ఉపయోగాలు ఉన్నట్లు స్పష్టం అవుతోంది. అయితే రాత్రివేళల్లో ప్రయాణించే సమయంలో, మహిళలు ఒంటరిగా వెళ్లాల్సి వచ్చినప్పుడు 'కార్ పూలింగ్' జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు చెబుతున్నారు.

నిలిచిన ఆర్టీఏ సేవలు



నిరీక్షిస్తున్న వాహనదారులు

అనంతపురం సెంట్రల్: రవాణా శాఖలో సర్వర్ పనిచేయకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. గత కొన్నేళ్ల కిందట ఆర్టీఏ సేవలు మొత్తం ఆన్‌లైన్ చేశారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ మెయింటెన్స్ చేస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ పనిచేయడం లేదు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో డ్రైవింగ్ లైసెన్స్‌లు, పర్మిట్‌లు, రిజిస్ట్రేషన్ సేవలు తదితర కార్యకలాపాలు నిలిచిపోయాయి. మూడు రోజుల వ్యవధిలో నిలిచిపోయిన కార్యకలాపాలన్నీ సోమ, మంగళవారాలకు వాయిదా వేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఎల్‌ఎల్‌ఆర్‌ల స్లాట్స్ కూడా వాయిదా వేసుకోవాలని ఆర్టీఓ సురేష్‌నాయుడు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నాటికి సర్వర్ పనిచేస్తుందని రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి సమాచారం వచ్చినట్లు వివరించారు. సోమవారం నుంచి యథావిధిగా కార్యాలయ సేవలు కొనసాగుతాయని తెలిపారు.

వసతి గృహాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు



అనంతపురం రూరల్: మైనార్టీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 2024-25విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వసతి గృహాల్లో 6-10వ తరగతి వరకు వంద మంది మైనార్టీ బాలికలకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వసతి గృహానికి ఐదు కిలోమీటర్లు దూరంలో ఉండి, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 97039 42423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్ట్రాంగ్ పర్యవేక్షణ

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత
- ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరు తీర్పు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

కదిరి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఎన్నికల సిబ్బంది ఈవీఎంలతో పాటు వీవీప్యాట్‌లను గట్టి పోలీస్ బందోబస్తు మధ్య ఎంపిక చేసిన ప్రాంతాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. జిల్లాలోని కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలకు, ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను లేపాక్షి చోళసముద్రం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు తరలించారు. జూన్ 4వ తేదీన ప్రస్తుతం ఈవీఎంలు భద్రపరిచిన చోటే ఆయా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుంది.

కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ

స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు.. ఇలా మూడంచెల్లో రాత్రింబవళ్లు భద్రత ఉంటుంది. వీరితో పాటు కంట్రోల్ యూనిట్ నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలను అమర్చారు. భద్రతా వ్యవస్థ పర్యవేక్షణకు ఎన్నికల సంఘం ప్రత్యేక అధికారులను నియమించింది. అనుమతులు లేకుండా ఆ ప్రాంతానికి వెళ్లడానికి అవకాశమే ఉండదు. ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో పాటు జిల్లా ఎన్నికల అధికారికి కూడా అనుమతి లేనిదే స్ట్రాంగ్ రూంల వద్దకు వెళ్లడానికి వీలు లేదు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి స్ట్రాంగ్ రూంలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తే కాల్చివేత ఆర్డర్స్ కూడా ఉన్నాయి. ప్రమాదవశాత్తూ స్ట్రాంగ్ రూంతో పాటు పరిసరాల్లో అగ్ని ప్రమాదం జరిగితే నివారణకు అగ్నిమాపక శకటాన్ని అందుబాటులో ఉంచారు. అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయం సమస్య లేకుండా జనరేటర్‌లను



లేపాక్షి గురుకుల పాఠశాలలో ధర్మవరానికి సంబంధించిన స్ట్రాంగ్‌రూంకు సీల్ వేస్తున్న ఎన్నికల అధికారులు(ఫైల్)

అమర్చారు.

కౌంటింగ్ రోజున ఓపెన్

ఓట్ల లెక్కింపు నాడు (జూన్ 4న) ఉదయం మాత్రమే స్ట్రాంగ్ రూంలను తెరిచి ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల గదులకు వరుస క్రమంలో తరలిస్తారు. అప్పటి వరకూ ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలోనే ఉంటాయి. స్వయంగా జిల్లా ఎన్నికల అధికారి ఆయా నియోజక వర్గాల ప్రధాన పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూంకు రెండు తాళాలు చొప్పున వేసి లక్కతో సీల్ వేసిన విషయం తెలిసిందే. ఒక తాళం చెవి(కీ)జిల్లా ఎన్నికల అధికారి వద్ద, మరోతాళం చెవి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్ద భద్ర పరిచారు. స్ట్రాంగ్ రూం పరిశీలనకు వచ్చే అధికారులను తప్ప... మరెవ్వరినీ అక్కడికి అనుమతించరు.

వాహనాలకు నో ఎంట్రీ

రెండో భద్రతా వలయాన్ని దాటే ప్రతి ఒక్కరూ తమ వివరాలను అక్కడ లాగ్‌బుక్(రిజిష్టర్)లో నమోదు చేయాలి. రిటర్నింగ్ అధికారి రోజూ ఉదయం, సాయంత్రం స్ట్రాంగ్ రూం ప్రాంగణాన్ని సందర్శించి లాగ్‌బుక్‌ను, సీసీటీవీ ఫుటేజ్‌ని పరిశీలిస్తారు. మంత్రులు, పోటీ చేస్తున్న అభ్యర్థులు, అధికారులు..చివరకు జిల్లా ఎన్నికల అధికారి అయినా సరే... వారి వాహనాలను మూడో అంచెలోకి అనుమతించరు. ఓట్ల లెక్కింపు నాడు స్ట్రాంగ్ రూంను ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, రిటర్నింగ్ అధికారి, పరిశీలకుడి సమక్షంలో వీడియో చిత్రీకరణ మధ్య తెరుస్తారు.

మూడంచెల భద్రత

జిల్లాలోని 4 నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు హిందూపురం 'బిట్' కళాశాలలోనూ, మరో రెండు నియోజకవర్గాల ఈవీఎంలు లేపాక్షి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద స్ట్రాంగ్‌రూంలలో భద్ర పరిచాం. స్ట్రాంగ్‌రూం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంది. అక్కడ 24 గంటలూ రక్షణ ఉండేలా మూడంచెల భద్రత ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల నిఘా కూడా ఉంది. జూన్ 4వ తేదీన కౌంటింగ్ రోజు వరకూ అలాగే ఉంటుంది. ఎవ్వరూ లోనికి వెళ్లడానికి ఉండదు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.

– అరుణ్‌బాబు, జిల్లా ఎన్నికల అధికారి

పచ్చబ్యాచ్‌కు పోలీసు వత్తాసు!

- పోలీసుల వైఫల్యం వల్లే హుస్సేన్‌పురంలో అల్లర్లు
- ముందస్తు సమాచారం ఉన్నా పట్టించుకోని ఎస్‌ఐ
- గొడవ సమయంలోనూ కనీస చర్యలు తీసుకోని వైనం
- అల్లర్ల ఘటన తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యం
- కుటుంబీకులనూ స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్న ఖాకీ

చిలమత్తూరు: పోలింగ్ సందర్భంగా ఈనెల 13వ తేదీన మండలంలోని హుస్సేన్‌పురంలో చోటుచేసుకున్న అల్లర్ల ఘటనలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల సందర్భంగా ఘర్షణలు చెలరేగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించినా స్థానిక పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. ఫలితంగా పోలింగ్ రోజున టీడీపీ నేతలు రెచ్చిపోయి బీభత్సం సృష్టించారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు లక్ష్యంగా రాళ్లు రువ్వారు. మారణాయుధాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.

13వ తేదీ ఏం జరిగిందంటే..

పోలింగ్ జరిగిన 13వ తేదీ ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తన స్వగ్రామం హుస్సేన్‌పురంలో పోలింగ్ సరళి పరిశీలిస్తున్నారు. దీన్ని సహించలేని టీడీపీ నాయకుడు బాబురెడ్డి ఆయన్ను దుర్భాషలాడారు. అయినా సంయమనం పాటించారు. గొడవలు ఎందుకని భావించి అక్కడి నుంచి వెళ్లిపోతుండగా..



ఈ నెల 13న టీడీపీ మూకల దాడిలో ధ్వంసమైన ఎంపీపీ పురుషోత్తమరెడ్డి కారు

టీడీపీ అల్లరి మూకలు ముందస్తు ప్లాన్ ప్రకారం కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. ఎంపీపీ కారుపై రాళ్లు రువ్వారు. ఎంపీపీ కారు దిగగా, ఆయన్ను హతమార్చాలని పెద్దపెద్ద బండరాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఎంపీపీ స్వల్ప గాయాలతో బయటపడగా, ఆయన్ను రక్షించబోయిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నవీన్ తలకు తీవ్ర గాయమైంది. ఇంత జరుగుతున్నా.. పోలీసు యంత్రాంగం అటువైపు చూసిన పాపాన పోలేదు. దీంతో గ్రామస్తులంతా టీడీపీ అల్లరి మూకలపై తిరబడ్డారు. టీడీపీ నేత బాబురెడ్డికి దేహశుద్ధి చేశారు. అయితే పచ్చ బ్యాచ్ ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకుని టీడీపీ నేతపై దాడి జరిగిందంటూ నానా యాగీ చేసింది. దీనికి స్థానిక ఎస్‌ఐ గంగాధర్ కూడా సహకరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పోలింగ్ ఏకపక్షం చేసే క్రమంలోనే టీడీపీ నాయకుడు బాబురెడ్డి తన అనుచరులు ద్వారా అలజడి సృష్టించారని గ్రామస్తులు చెబుతున్నారు.

ముడుపులు ముట్టడం వల్లేనా...?

ఎస్ గంగాధర్ టీడీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, వారి కుటుంబ సభ్యులను టార్గెట్ చేశారు. పోలింగ్‌కు రెండు రోజులు ముందు ఓ టీడీపీ నేత స్టేషన్‌కు రూ.1.25 లక్షలు ఇచ్చినట్టుగా ఆరోపణలున్నాయి. నగదు పంపిణీ అడ్డుకోవద్దంటూ మరో రూ.10 లక్షలు, ప్రస్తుత కేసులో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఆయన అనుచరులను రిమాండ్‌కు పంపేందుకు మరో రూ.8 లక్షలు పోలీసులు తీసుకున్నట్లు మండల కేంద్రంలో చర్చ జోరుగా సాగుతోంది. కాగా ఎంపీపీ ఫిర్యాదు మేరకు 19 మంది టీడీపీ నేతలపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత దాడి పాల్పడిన టీడీపీ నేతలు ఫిర్యాదు చేయగా...బాధితులైన వైఎస్సార్ సీపీకి చెందిన 19 మందిపై 147, 148, 324, 307 రెడ్‌విత్ 149 సెక్షన్ల కింద ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. ఇరువర్గాలపై కేసు కట్టినా టీడీపీ నేతల ఫిర్యాదుపైనే ఎక్కువ ఆసక్తి కనబర్చడం విశేషం.

'కోడ్' అమల్లోకి వచ్చినప్పటి నుంచీ దాడులు

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచీ టీడీపీ నేతలు హింసను ప్రేరేపించడం మొదలు పెట్టారు. ఉద్దేశ పూర్వకంగానే ఎంపీపీ పురుషోత్తమరెడ్డిని రెచ్చగొట్టే వాఖ్యలు చేయడం, గొడవ పడటం వంటివి చేసేవారు. ఈ క్రమంలోనే ఏప్రిల్‌లో టీడీపీ నాయకుడు బాబురెడ్డి, తన అనుచరులతో కలిసి ఎంపీపీని లక్ష్యంగా చేసుకొని ఘర్షణకు దిగారు. ఈ ఘటన తర్వాత కూడా పోలీసులు అప్రమత్తం కాలేదు.

సంబంధం లేకపోయినా స్టేషన్‌కు తరలింపు

అల్లర్లకు ఘటనకు సంబంధించి ఎన్నికల కమిషన్ 'సిట్' ఏర్పాటు చేసిందని చెబుతున్న పోలీసులు అమాయకులను వేధిస్తున్నారు. కేసుకు సంబంధం లేని వారిని పలువురిని స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురిచేస్తున్నారు. పలువురిపై కేసులు నమోదు చేసి వారు దొరక్కపోవడంతో వారి బంధువులను స్టేషన్‌కు తీసుకువచ్చారు. కేసులో నిందితులుగా పేర్కొన్న వారు లొంగిపోతేనే మిమ్మల్ని వదులుతామంటూ బెదిరిస్తున్నారు. గొడవలకు సంబంధం లేని వారిపై కేసులు పెట్టడం ఒక ఎత్తయితే వారి కుటుంబ సభ్యులనూ హింసించడం పట్ల ప్రజలు పెదవివిరుస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, పలువురు గ్రామస్తులు పోలీసులకు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు తెలుస్తోంది.

చెన్నకేశవా..మము బ్రోవుమా



సింహ వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మూడోరోజు శుక్రవారం లక్ష్మీచెన్నకేశవస్వామి సర్వభూపాల, సింహ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం సమక్షంలో అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్‌లు సర్వభూపాల వాహనంపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పూజలు చేశారు. సాయంత్రం సింహవాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. కాగా, శనివారం స్వామివారు కల్పవృక్ష, హనుమద్ వాహనాలపై పురవీధుల్లో ఊరేగనున్నారు.

పిడుగు పాటుకు ఆవు సజీవ దహనం



పావగడ: తాలూకాలోని అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగసముద్రం గ్రామంలో గురువారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఇందులో భాగంగానే ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. అదే విధంగా పిడుగులు పడ్డాయి. ఈ నేపథ్యంలోనే రైతు కరియప్పకు చెందిన పశువుల కొట్టం పిడుగు నిప్పు రవ్వల మంటలతో దగ్ధమైంది. కొట్టంలో ఉన్న ఆవు సజీవ దహనమైంది. మరో మూడు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇదే సమయంలో ఆవులకు కాపలాగా కొట్టంలో పడుకుని ఉన్న కరియప్ప, ఆయన మనువడు మహలింగ తీవ్ర గాయాల పాలయ్యారు. మహలింగ ఆవులను రక్షించబోగా మంటల్లో చిక్కుకుని మంటల వేడికి చేతులు, కాళ్లు స్వల్పంగా కాలాయి. వారిద్దరూ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై అరసికెర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. స్థానిక తహసీల్దార్ సంతోష్‌కుమార్, పశు వైద్యాధికారి అశ్వర్థనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పిడుగు పాటుతో పశువుల కొట్టం, ఆవు పూర్తిగా దహనమై నష్టం జరిగిందని ప్రభుత్వం తరఫున నష్ట పరిహారం అందివ్వాలని బాధిత కుటుంబీకులు తహసీల్దార్‌ను కోరారు.

రైలు కింద పడి యువకుడి మృతి



మృతుడు రాజు (ఫైల్)

ముదిగుబ్బ: మండల పరిధిలోని సంకేపల్లి గ్రామ సమీపంలోని రైల్వే గేటు వద్ద శుక్రవారం రాత్రి లింగప్ప కుమారుడు రాజు (27) అనే యువకుడు రైలు కింద పడి మృతి చెందాడు. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రాజు ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా రాజు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య సాయి, కుమారుడు యశ్వంత్, కూతురు అఖి ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎండిన వక్క రైతుల ఆశలు

- చెట్లలోనే ఎండిపోయిన వక్క కంకులు
- తగ్గనున్న దిగుబడి
- ఈ ఏడాది గిట్టుబాటు కాదంటున్న రైతులు



మడకశిర వద్ద సాగైన వక్క తోట



ఎండ తీవ్రతకు చెట్టులోనే ఎండిపోయిన వక్క కంకులు

మడకశిర: జిల్లాలోనే మడకశిర నియోజకవర్గంలో వక్క తోటలు అధికం. నియోజకవర్గంలోని రైతులను ఆర్థికంగా వక్క తోటలు ప్రతి ఏడాది అంతో ఇంతో ఆదుకుంటున్నాయి. ఈ ఏడాది కూడా వక్క తోటల ఆదాయంపై రైతులు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి ఆశల అడియాశలయ్యాయి. రైతులు ఆశించినంత దిగుబడి ఈ ఏడాది వక్క తోటల్లో వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

ఎండ ప్రభావం

నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో వక్క తోటలు విస్తరించి ఉన్నాయి. దాదాపు 1,500 హెక్టార్లలో పంటకొచ్చిన వక్క తోటలు ఉన్నాయి. ప్రతి ఏడాది వక్క తోటల నుంచి రైతులకు రూ. కోట్లల్లో ఆదాయం లభిస్తోంది. దాదాపు 10 వేల మంది రైతులు వక్క తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఈ ఏడాది అధిక ఎండలు వక్క తోటల రైతులను నట్టేట ముంచాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది ఎండలు దంచి కొట్టాయి. ఉష్ణోగ్రతలు మడకశిర ప్రాంతంలో 42 డిగ్రీ వరకూ నమోదయ్యాయి. ఆ ప్రభావం వక్క తోటలపైనా పడింది. ఎండ తీవ్రతకు వక్క కంకులు చెట్లలోనే ఎండిపోయాయి. వేసవి కాలంలోనే వక్క చెట్లలో కంకులు వస్తాయి. ఒక చెట్టుకు 5 నుంచి 10 వరకు వక్క కంకులు ఉంటాయి. ఇందులో ఎండ తీవ్రతకు రెండు నుంచి 3 వరకు వక్క కంకులు ఎండిపోయాయి. దీంతో ఈ ఏడాది వక్క దిగుబడి తగ్గడానికి ఎండ తీవ్రత కారణంగా మారింది.

ధరపైనే రైతుల ఆశలు

వక్క ధరపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. దిగుబడిపై ఆశలు వదులుకున్న రైతాంగం ధర ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నారు. దిగుబడి తగ్గినా ధర ఆశాజనంగా ఉంటే వక్క రైతుల ఆదాయం బాగుండే అవకాశం ఉంటుంది. లేకపోతే వక్క రైతులకు నష్టాలు తప్పవని అంటున్నారు. వక్క ధర క్వింటాల్ రూ. 50 వేల నుంచి రూ.55 వేల వరకు పలికితే రైతుల ఆదాయం పెరగడానికి అవకాశం ఉంటుంది. లేకపోతే వక్క రైతులకు ఈఏడాది గడ్డు కాలమే.

ఎండ ప్రభావంతో నష్టం



ఈఏడాది ఎండ ప్రభావంతో వక్క రైతులకు తీవ్ర నష్టం జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండాయి. దీంతో వక్క చెట్లలోని కంకులు ఎండిపోయాయి. చెట్టుకు మూడు వరకూ కంకులు ఎండిపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గనుంది. గత ఏడాది కంటే ఈఏడాది ఆదాయం 40 శాతం తగ్గనుంది.

– కెంచప్ప, వక్క రైతు, మద్దనకుంట

ఆశలు వదులుకున్నాం



ఈఏడాది వక్క దిగుబడిపై ఆశలు వదులుకున్నాం. ఎండ తీవ్రతే ఇందుకు కారణం. ధరలపైనే ఆశలు పెట్టుకున్నాం. దిగుబడి తగ్గినా ధరలు ఆశాజనంగా ఉంటే కొంత వరకు ఊరట చెందుతాం. లేకపోతే ఈ ఏడాది నష్టం తప్పదు. ధరలు లేకపోతే పెద్ద ఎత్తున ఆదాయాన్ని కోల్పోతాం.

– నాగేగౌడ్, వక్క రైతు, దేవగానిపల్లి

ధర బాగుంటేనే...



ఈఏడాది ఎండ వేడిమి వక్క రైతుల కొంప ముంచింది. వక్క తోటలకు వారానికి రెండు సార్లు నీరు కట్టినా ఎండ తీవ్రతకు కంకుల్లోని కాయలు నేలపాలయ్యాయి. దీంతో ఎకరా వక్క తోట ఆదాయం రూ.7 లక్షల నుంచి రూ.4 లక్షలకు పడిపోయింది. మార్కెట్‌లో వక్క ధర బాగుంటే కొంత వరకు నష్టాల నుంచి బయట పడతాం. లేకపోతే అప్పుల పాలు కావడం ఖాయం.

–నారాయణప్ప, వక్క రైతు, టీడీపల్లి

ఇండియన్ సిక్సర్స్, ఫ్యామిలీ క్లబ్ జట్ల గెలుపు



వినయ్‌కుమార్‌కు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం క్రికెట్ లీగ్–2లో భాగంగా శుక్రవారం జరిగిన ఇండియన్ సిక్సర్స్, యూనైటెడ్ చాంపియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇండియన్ సిక్సర్స్ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. టి.మహేందర్‌రెడ్డి 34 బంతుల్లో 48 పరుగులు (నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్) , ఎం. రాజ కుళ్లాయప్ప 36 బంతుల్లో 43 పరుగులతో (2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన యూనైటెడ్ ఛాంపియన్స్ 19.2 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌట్ అయింది. బీఎస్ వినయ్‌కుమార్ కేవలం 20 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీయడంతో ఇండియన్ సిక్సర్స్ జట్టు 26 పరుగుల తేడాతో గెలుపొందింది. బీఎస్ వినయ్‌కుమార్‌కు 'మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

- ఆర్డీటీ–బీ గ్రౌండ్‌లో దినేష్ గ్రానైట్స్, ఫ్యామిలీ క్లబ్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ఫ్యామిలీ క్లబ్ తొలుత బ్యాటింగ్ చేసింది. 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 188 పరుగులు చేసింది. బి. యోగానంద 44 బంతుల్లో 57 పరుగులు (ఆరు ఫోర్లు), రామమూర్తి 31 బంతుల్లో 42 పరుగులు, ఎస్కే ఇస్మాయిల్ 10 బంతుల్లో 21 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన దినేష్ గ్రానైట్స్ జట్టు 18.3 ఓవర్లకు 126 పరుగులకు ఆలౌట్ అయింది. డీబీ ప్రశాంత్ 22 బంతుల్లో 30 పరుగులు, ఖాదర్‌వలి 29 పరుగులు, పి. గిరినాథరెడ్డి 26 పరుగులు చేశారు. మహమ్మద్ ఆసీఫ్ మూడు వికెట్లు తీసి దినేష్ గ్రానైట్స్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. యోగానందకు మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతుడు వేణుఆచారి

రాప్తాడురూరల్: ఆటో వేగంగా వస్తూ రోడ్డుదాటుకుంటున్న ఎనుము ఢీ కొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఓ ప్రయాణికుడితో పాటు ఎనుము కూడా మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున అనంతపురం రూరల్ మండలం పాములాయి గ్రామ సమీపంలో జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... గార్లదిన్నెకు చెందిన నారాయణస్వామి, వేణుఆచారి (66) మామా అల్లుళ్లు. ఉదయాన్నే పని మీద ఆటోలో అనంతపురం బయలుదేరారు. పాములాయి సమీపంలోకి రాగానే ఎనుము రోడ్డు దాటుకుంటోంది. గమనించని ఆటోడ్రైవర్ బీమా వేగంగా వచ్చి ఎనుమును ఢీ కొట్టాడు. దీంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో వేణుఆచారి మృతి చెందగా నారాయణస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సర్వజన ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నారు. ఆటోడ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఏఎస్ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాయదుర్గంలో మరొకరు...

రాయదుర్గం రూరల్: పట్టణంలోని శాంతినగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన అరవా గంగమ్మ (68) మృతి చెందినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. రాత్రి కరెంట్ లేని సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఇంటి వద్దనే రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళుతున్న గంగమ్మను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. ఢీ కొన్న వాహనం ఆపకుండా వెళ్లిపోయిందన్నారు. కుమారుడు అరవా మైలారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాధ్యుడిని వదిలేసి ఇతరులపై వేటు

- తాడిపత్రి ఘటనలో బాధ్యుడైన ఏఎస్పీ సేఫ్‌జోన్
- డీఎస్పీ, సీఐలపై సస్పెన్షన్
- ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విస్మయం

తాడిపత్రిరూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం తాడిపత్రిలో రెండు రోజుల పాటు జరిగిన అల్లర్లు, దాడులు, ప్రతిదాడులకు సంబంధించి ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలు విమర్శలకు తావిస్తున్నాయి. శాంతిభద్రతలు అదుపుతప్పడానికి ఏఎస్పీ రామకృష్ణ బాధ్యుడని ఆరోపణలు పెల్లుబికిన నేపథ్యంలో ఆయన్ను కాకుండా డీఎస్పీ గంగయ్య, పట్టణ సీఐ మురళీకృష్ణను సస్పెండ్ చేశారు. ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం విస్మయం కలిగిస్తోంది. తాడిపత్రి డీఎస్పీగా గంగయ్య 2023 మే5న బాధ్యతలు స్వీకరించారు. మొదటి నుంచి వివాదాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. ఆయన వచ్చినప్పటి నుంచి తాడిపత్రిలో రాజకీయ వివాదాలు, శాంతిభద్రతల సమస్య ఏర్పడలేదు. పోలింగ్ అనంతరం అల్లర్లను నియంత్రించేందుకు డీఎస్పీ గంగయ్య తన వంతు కృషి చేశారు. సిబ్బంది తక్కువగా ఉండటం టీడీపీ మద్దతుదారులు భారీగా ఉండటంతో ఏం చేయలేని పరిస్థితి. పట్టణ సీఐగా ఉన్న మురళీకృష్ణ తాడిపత్రికి వచ్చి ఏడాది కూడా కాలేదు. ఆయన కూడా వివాదాలకు దూరంగా ఉండేవారు. అల్లర్లను నియంత్రించడానికి సీఐ మురళీకృష్ణ ప్రయత్నించి రాళ్ల దాడిలో గాయపడ్డారు. వీరిద్దరూ ఎస్పీతో పాటు తాడిపత్రి ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏఎస్పీ రామకృష్ణ పరిధిలో ఉండటంతో సొంత నిర్ణయాలు తీసుకొని అల్లర్లను నియంత్రించలేని పరిస్థితి. అల్లర్లకు బాధ్యులను చేస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న చర్యల్లో ఎస్పీతో పాటు డీఎస్పీ, సీఐలు సస్పెండ్ చేశారు. అయితే ఏఎస్పీ రామకృష్ణ తప్పించుకోవడం బట్టి చూస్తే ఆయనకు చంద్రబాబుతో డైరెక్టు లింకు ఉందని, ఆ మేరకే తాడిపత్రికి ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వేయించుకున్నారని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఓడించడానికి స్థానిక టీడీపీ నాయకులతో చేతులు కలిపారని , ఆ సంబంధాల ద్వారానే సస్పెండ్‌ను తప్పించుకొని ఉండవచ్చని ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేసిన ఆరోపణలు నిజమేనా అన్న ప్రశ్నలు అందరిలో తలెత్తుతున్నాయి.

తల్లిని చంపిన కుమారుడి అరెస్టు



వెంకటేశులును అరెస్టు చూపుతున్న పోలీసులు


కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండల పరిధిలోని వైసీపల్లిలో ఈ నెల 14న కుంటుంబ కలహాలతో కొడుకు చేతిలో తల్లి దారుణంగా హత్యకు గురైంది. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేశారు. వివరాలు.... వైసీపల్లికి చెందిన వడ్డే సుంకమ్మ, రామదాసు భార్య, భర్తలు. వారి కుమారుడు వెంకటేశులు అనంతపురంలో భార్యతో పాటు ఉంటూ అప్పుడప్పుడూ గ్రామానికి వస్తుండేవాడు. ఈ నెల 14న వెంకటేశులు గ్రామానికి వచ్చాడు. అయితే సుంకమ్మ, రామదాసులు కుటుంబ కలహాలతో గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలోనే రామదాసు కాలికి గాయమైంది. నాన్నను గాయపరుస్తావా? అంటూ తల్లి సుంకమ్మ తలపై కొడుకు వెంకటేశులు కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అయితే ఘటనా స్థలం నుంచి నిందితుడు పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న నిందితున్ని శుక్రవారం కంబదూరు మండలం నూతిమడుగు వద్ద రూరల్ సీఐ నాగరాజు, కంబదూరు ఎస్ఐ, ఆంజనేయులు సిబ్బందితో కలసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

రైల్వే సామగ్రి చోరీ కేసులో నిందితుల అరెస్టు

అనంతపురం సిటీ: గార్లదిన్నె మండలం కల్లూరు సమీపంలోని పాత క్వార్టర్స్ వద్ద ఉన్న రైల్వేకు సంబంధించిన పాత సామగ్రి చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు అనంతపురం ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మధుకర్‌చారి తెలిపారు. గురువారం జరిగిన ఘటనకు సంబంధించి కల్లూరుకు చెందిన దూద్‌వలి, జిలానీతో పాటు ఆటో డ్రైవర్ నల్లబోతుల నాగరాజును అరెస్టు చేశామన్నారు. పాత సామగ్రి చోరీకి ఉపయోగించిన ఆటోను సైతం సీజ్ చేసినట్లు వివరించారు. అరెస్టు చేసిన నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు వెల్లడించారు.

మట్టి దిబ్బలు పడి కూలీ మృతి

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామానికి చెందిన గాజుల రాజశేఖర్ (41) అనే వ్యక్తిపై మట్టి దిబ్బలు పడి శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. గలగల గ్రామానికి చెందిన రాజశేఖర్, భాగ్యమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజశేఖర్ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. గ్రామ సమీపంలో ఉన్న ఆర్.కొత్తపల్లి చెరువులోని ఇసుకను ఎద్దుల బండిలో తరలించేందుకు వెళ్లాడు. అడుగున ఉన్న ఇసుకను తవ్వుతుండగా పైనున్న మట్టిదిబ్బలు ఒక్కసారిగా మీద పడడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు మట్టిదిబ్బలను తొలగించేలోగా మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



జీవన పోరాటం

చింత చెట్లకు చిగురు రావడంతో చిగురు కోస్తూ ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. ఎంత పెద్ద చెట్టు అయినా సరే చిటారు కొమ్మలకు చేరుకొని చిగురు సేకరించి అమ్ముతున్నారు. పట్టు తప్పితే ప్రాణాలకు ముప్పని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో చింత చిగురును కోస్తున్నారు. నాలుగు మెతుకుల కోసం ఈ కష్టం తప్పడం లేదని వారు చెబుతున్న మాటలు మనసున్నోళ్లెవరికైనా కన్నీళ్లు తెప్పించక మానవు. ఈ సీజన్‌లో వచ్చే అరకొర డబ్బులతో తమ కుటుంబాలు పోషించుకుంటున్నామని చెబుతున్నారు. పెనుకొండ పట్టణంలో ఇద్దరు మహిళలు చిటారు కొమ్మలో చిగురు సేకరిస్తున్న ఈ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– పెనుకొండ: